పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్
- పెదఅమిరంలో గడపగడపకు మన ప్రభుత్వం



పెదఅమిరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ళ: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు,రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు అన్నారు.కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా అందుతున్న సంక్షేమాన్ని వారికి వివరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో ఏ ఇంటికి వెళ్లినా ఘనస్వాగతం పలుకుతున్నారన్నారు. జగన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ప్రజల ఆదరణ చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాముకూడా పాలుపంచుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. ప్రస్తుతం ఎటువంటి ఎన్నికలు లేనప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా తెసుకునేందుకే ప్రతీ ఇంటికీ వస్తున్నట్లు తెలిపారు. పెదఅమిరం గ్రామం అంటే టీడీపీకి కంచుకోట అని చెప్పుకుంటారని కానీ ప్రజల ఆశీస్సులను చూస్తుంటే మార్పు మొదలైనట్లు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. గ్రామంలో ఇప్పటికే 230 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. మిగిలిన వారికి కూడా అర్హతను బట్టి ప్రతీ ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజలకు 90 శాతం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా కంకణం కట్టుకున్నారని ధీమాను వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉండిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. నాడు నేడు పథకంలో పాఠశాలలు, సీసీరోడ్లు నిర్మించి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెన్మత్స దుర్గాప్రసాదరాజు, జవ్వాది సత్యనారాయణ, బిరుదుగడ్డ గంగాధర్, ఏడిద వెంకటేశ్వరరావు, బిరుదుగడ్డ రమేష్, కేశవరపు కృష్ణంరాజు, రుద్రరాజు వెంకటరామకృష్ణంరాజు, వీరమలుల బోసు, సరాబు ముఖేష్, పెన్మత్స రంగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



అంగన్‌వాడీ ఆయాలకు నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం : పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన, బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతనంగా నియమించిన అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలు విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేసి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో నూతనంగా ఎంపికైన 30 మంది వలంటీర్లకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాల ప్రజలకు అర్హతను బట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే విధంగా కృషి చేయాలన్నారు. వలంటీర్లపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అచంచల విశ్వాసముందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో అర్హులెక్కడా మిలిగిపోకూడదనే వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటుచేశారన్నారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, భీమవరం ప్రభుతాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పేరిచర్ల సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బాబాకు స్వర్ణకిరీటం బహూకరణ



బహూకరించిన స్వర్ణకిరీటం

కాళ్ళ: మండలంలోని సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా ఆలయంలోని ఉత్సవ విగ్రహానికి భక్తుడు మంతెన సాయి కనక వెంకట రామరాజు సుమారు రూ.1.40 లక్షల విలువైన మూడు కాసుల స్వర్ణ కిరీటాన్ని సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోరం అనంతలక్ష్మీ సత్యవతిదేవి దాత కుటుంబ సభ్యులకు బాబా వారి ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రం, బాబా వారి ప్రతిమతో వారిని సత్కరించారు.

చెన్నమల్లేశ్వరస్వామికి విశేష పూజలు



ఉండి రాజులపేట శివాలయంలో శ్రావణమాస పూజలందుకుంటున్న మల్లేశ్వరస్వామి

ఉండి: మండలంలోని రాజులపేటలో వేంచేసియున్న పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి వారికి శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు విశేష పూజలు చేశారు.ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా అర్చకులు సాంప్రదాయబద్దంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎతున పాల్గొన్నారు.

ఓపీ కార్డుల వితరణ

పెనుగొండ: ఆచంటలో 30 పడకల ప్రభుత్వాసుపత్రికి మానవత ఆధ్వర్యంలో 30 ఓపీ కార్డులను అందించారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 5000 ఓపీ కార్డులను ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులకు అందించారు. మానవత అధ్యక్షుడు శివన్నారాయణ సతీష్ కుమార్, కార్యదర్శి బొక్కా రామకృష్ణ, మండల కన్వీనరు నంబూరి అంజిబాబు, మండల కో కన్వీనరు వై.శ్రీనివాస్, అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కె.లీలా ప్రసాద్, ఆత్మీయ కమిటీ సభ్యుడు కేఎస్ శర్మ పాల్గొన్నారు.

మానవత సాయం



బాధితుడికి నిత్యాసవర సరుకులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితునికి భీమవరం మండల మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు అందించారు. పట్టణంలోని ఉండి రోడ్ అనాకోడేరు కాలువ గట్టు వద్ద నివాసముంటున్న తామాడ శంకర్ నివాసంలో ఇటీవల గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. దీనితో బాధితునికి మానవత సేవాసంస్థ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతిరాజు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి కారుమూరి నర్సింహమూర్తి, మలిశెట్టి సాయిబాబా, చోడిశెట్టి శ్రీనివాస్ కొండ, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడాలి

- సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి
- కష్టపడితే పదవులు వరిస్తాయి



ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్కే రసూల్ బీబీ, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న పీవీఎల్

ఆకివీడు: రైతుల శ్రేయస్సు కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీలు నిరంతరం పాటుపడాలని, సీఎం జగన్ రైతు పక్షపాతి అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్శింహారాజు చెప్పారు. ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్కే. రసూల్ బీబీ, వైస్ చైర్మన్‌గా గంటా ఆనందరావు, డైరెక్టర్లతో సోమవారం పీవీఎల్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీలు తమ ఆదాయాన్ని పెంచుకుంటూ, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతీ కార్యకర్త, నాయకుడిని సీఎం జగన్ ఎప్పుడూ గుర్తించుకుంటారన్నారు. కష్టపడిన వారికి పదవులు వరిస్తాయని పీవీఎల్ పేర్కొన్నారు. పార్టీకి విశిష్ట సేవలందించిన వ్యక్తుల్ని గుర్తించి, అన్నిసామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకుని ఏఎంసీ డైరెక్టర్లను నియమించామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, టీటీడీ మాజీ సభ్యులు గోకరాజు రామరాజు మాట్లాడుతూ పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చైర్మన్ రసూల్ బీబీ మాట్లాడుతూ తనకు పదవిని కేటాయించిన సీఎం జగన్, డీసీసీబీ చైర్మన్ నర్శింహారాజు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, జెడ్పీటీసీలు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, శ్రీహరి నారాయణరాజు, వైస్‌చైర్మన్లు పుప్పాల పండ, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పల్లెం అరుణకుమారి, ఎస్కే. హుస్సేన్, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, సాగిరాజు హరివర్మ, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పెన్మెత్స ప్రసాదరాజు, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మోషేన్‌రాజును కలిసిన గాదిరాజు



సుబ్బరాజును సత్కరిస్తున్న మోషేన్ రాజు

సాక్షి, భీమవరం: తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమితులైన గాదిరాజు సుబ్బరాజు సోమవారం భీమవరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మోషేన్ రాజును ఆయన నివాసంలో కలిసి ఈ నెల 30న టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు సుబ్బారాజు తెలిపారు. అనంతరం మోషేన్‌రాజు దుశ్శాలువాతో సుబ్బరాజును సత్కరించారు. అలాగే ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజును ఆయన నివాసంలో సుబ్బరాజు కలిశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, మారిశెట్టి వెంకటేశ్వర్లు, గాదిరాజు తాతరాజు, గొట్టుముక్కల పద్మరాజు, కోరుకొల్లు బాబు, బోసురాజు, తదితరులు ఉన్నారు.

మోగల్లు పంచాయతీ కార్యదర్శిపై స్పందనలో ఫిర్యాదు

పాలకోడేరు: మోగల్లు పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజును సస్పెండ్ చేయాలని మోగల్లు గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. గతంలో పంచాయతీ కార్యదర్శి స్థానికులతో కుమ్మక్కై పంచాయతీ నిధులను సొంత ఖాతాకు వేసుకుంటున్నాడని పాలకోడేరు ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా ఆయన విచారణ చేసి జిల్లా పంచాయతీ అధికారి కు నివేదిక పంపారని గుర్తు చేశారు. ఇది జరిగి నాలుగు నెలలు గుడిచినా ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు. వెంటనే ఆయనను విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఎస్ శ్యామ్ కుమార్, సునీత, క్రాంతి బాబు, చిరంజీవి, సుబ్రహ్మణ్యం దావీదు, వరలక్ష్మి, మధు విజయలక్ష్మి మేరి లక్ష్మిలు ఉన్నారు.

ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఏలూరుపాడు నుంచి ఆకివీడు తరలివెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కాళ్ళ: ఆకివీడు మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాళ్ల మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. మండలం నుంచి ఆకివీడు ఏఎంసీ వైస్ చైర్మన్ కాళ్లకూరు గ్రామానికి చెందిన గంటా ఆనందరావు, డైరెక్టర్లుగా ఏలూరుపాడు గ్రామం నుంచి పడమట సుబ్బయ్య, కాళ్ల నుంచి నిమ్మల వెంకటరత్నం, బోసు కాలనీకి చెందిన మంతెన లక్ష్మి సూర్యకుమారీలు వెళ్లారు. కాళ్ళ, ఏలూరుపాడు, కాళ్ళకూరు తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

గ్రంధి చొరవతో అభివృద్ధి పనులు వేగవంతం



ఎల్‌వీఎన్ పురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఏడుకొండలు

భీమవరం అర్బన్: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చొరవతో భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు అన్నారు. భీమవరం మండలంలోని ఎల్‌వీఎన్ పురం గ్రామంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన రూ. 20 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. రూ.2 కోట్ల 36 లక్షలతో తాడేరు వంతెన నిర్మాణ పూర్తి చేశారని, అదేవిధంగా యనమదుర్రు డ్రైయిన్‌పై నిరుపయోగంగా ఉన్న 3 వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించేందుకు రూ.36 కోట్లు మంజూరు చేయించారన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.20 కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా రూ.22 కోట్లతో పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. సర్పంచ్ కేతా నాగబాబు, ఎంపీటీసీ వీరవల్లి శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు చేయాలి



విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యుత్ అమరవీరుల త్యాగ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. భీమవరం మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం విద్యుత్ అమరవీరుల స్మారక సభ సీపీఎం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు అధ్యక్షతన జరిగింది. సభలో బలరామ్ మాట్లాడుతూ 2000లో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేపట్టిన ఉద్యమాన్ని అణచివేయడానికి ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో నిర్బంధాన్ని ప్రయోగించి, కాల్పులు జరిపిందన్నారు. ఈ కాల్పులు, లాఠీచార్జ్‌ల్లో విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకనుగుణంగా విద్యుత్ చార్జీలు పెంచిన టీడీపీ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైందని ఉద్యమంతో అప్పటి ప్రభుత్వం తప్పనిసరిగా విద్యుత్ చార్జీలు తగ్గించాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు, త్రిమూర్తులు, డేగల నాగు, బంగారు వరలక్ష్మి, రమేష్, ఒడుగు వెంకటేశ్వరరావు, రాంబాబు, నజీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాళ్లవానిగరువులో బస్ షెల్టర్ ప్రారంభం



యాళ్లవానిగరువులో బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి

పాలకొల్లు అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ విజయం సాధించేందుకు నాయకులంతా సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ విరాళంతో తల్లిదండ్రులు సూర్యప్రకాశరావు - కృపమ్మ జ్ఞాపకార్థం యాళ్లవానిగరువు (దొడ్డిపట్ల రోడ్డు)లో రూ.3 లక్షలకుపైగా వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను గోపి ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం తన సొంత సొమ్ముతో బస్ట్ షెల్టర్ నిర్మించినట్టు ఆనందప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 24 అర్జీలు

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన లో వివిధ సమస్యలపై 24 అర్జీలు వచ్చాయని కార్యాలయ ఏఓ యేడిద శ్రీనివాస్ తెలిపారు. భూసర్వే, ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయని చెప్పారు. ఫిర్యాదులు పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెక్కుల అందజేత

సాక్షి, భీమవరం: పేద విద్యార్థుల ఉన్నత విద్యకోసం మంతెన రామలింగరాజు, కాంతమ్మ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ రాజు తెలిపారు. ఫౌండేషన్ 49వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రామలింగరాజు నివాసంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ముందుగా రామలింగరాజు, కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంబీబీఎస్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రూ.45 వేలు, ఇంజనీరింగ్ విద్యార్థులు 28 మందికి రూ.3 లక్షలు, బీ ఫార్మసీ విద్యార్థికి రూ.11 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులు నలుగురికి రూ.36 వేలు, చార్టర్డ్ అకౌంటెంట్ విద్యార్థికి రూ.11 వేలు, పీజీ విద్యార్థులు ఏడుగురికి రూ.63 వేలు, డిగ్రీ విద్యార్థులు 9 మందికి రూ.81 వేలు, నీట్ విద్యార్థికి రూ.9 వేలు, ఇంటర్మీడియెట్ విద్యార్థికి రూ.9 వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి చేకూరి జాన్సీలక్ష్మి, అల్లూరి సీతారామరాజు సేవాసమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ముదునూరి సూర్యనారాయణరాజు, సీహెచ్‌ఏ వీఎల్ సుబ్రహ్మణ్యంరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, మంతెన రామచంద్రరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, పేరిచర్ల లక్ష్మణవర్మ, చెల్లబోయిన రంగారావు, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ మల్లికార్జునరావు

ఉండి: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా రీసర్వే కార్యక్రమంపై గ్రామాధికారులు ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉండిలోని మండల పరిషత్ కార్యాలయంలో రీసర్వేపై గ్రామ పంచాయతీ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గతంలో రీసర్వే కార్యక్రమం ద్వారా పంట భూమిలను సర్వే చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రతీ ఇంటినీ రీసర్వే కార్యక్రమంలో కొలతలు వేసి ఇంటి యజమానులకు ప్రాపర్టీ కార్డులు అందజేస్తారని అన్నారు. దీనిలో భాగంగా పంచాయతీ గ్రామ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గతంలో డ్రోన్ పై జరిగిన ప్రాంతాలకు సంబంధించిచి త్వరలోనే మ్యాప్‌లు వస్తాయని అవి రాగానే రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించి రీసర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమావేశమై ఓటు నమోదు కార్యక్రమంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులకు అందించిన వివరాల ప్రకారం అర్హులైన కొత్త ఓట్లు నమోదు, మరణించిన, శాశ్వతంగా ఊరు విడిచి వెళ్లిపోయిన ఓట్లు తొలగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ అప్పారావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదఅమిరంలో గడపగడపకు కార్యక్రమం

కాళ్ళ: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాళ్ల మండలం పెదఅమిరంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సోమవారం తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల ప్రభుత్వాధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆయన తెలిపారు.

పొన్నమండ బాలకృష్ణకు సన్మానం

పాలకోడేరు: జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన పొన్నమండ బాలకృష్ణకు సోమవారం విస్సాకోడేరు ప్యారిస్ ఆరు సంఘాల పీసీసీ ఆల్‌సీసీ ఆధ్వర్యంలో గొరగనమూడి, పెదపేటలోని సెయింట్ జోషఫ్ చర్చిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గురు మండల అధ్యక్షుడు పాస్టర్ ఎమ్ రాజు ఎలిగేట్ రాజశేఖర్, ఆల్టర్నేట్ డెలిగేట్, పాము నరసింహం హాజరయ్యారు. బాలకృష్ణ దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని పాస్టర్ రాజు ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు తులసీ చంద్రమోహన్, పాలపర్తి చిన్ని, గోడి రమేష్ బాబు, పితాని సద్మనాభం, మట్టా రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ

యలమంచిలి: మండలంలోని గుంపర్రు, కాంభోట్లపాలెం, చింతదిబ్బ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తోన్న 60 మంది రైతులకు సోమవారం మండల వ్యవసాయ అధికారి చిండులూరి దేవి గుంపర్రు సర్పంచ్ తుంగా అమూల్య చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ రైతులంతా రసాయనిక వ్యవసాయం మానివేసి, తమకున్న పొలంలో కనీసం 30 నుంచి 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. పొలం గట్లు, ఇంటి పెరటిల్లోనూ కాయకూరల సాగు చేయాలన్నారు. అనంతరం రైతులకు సర్పంచ్ అమూల్య, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డిలు వేప పిండి, పాల ఇంగువ, కోడి గుడ్డు నిమ్మరసం, పసుపు, తెలుపు పళ్లాలు, లింగాకర్షక బుట్టలు, కిచెన్ గార్డెన్ విత్తనాలు, జీవామృతం తయారీ సంచి, అజోల, బయోకల్చర్ కిట్లు పంపిణీ చేశారు.

స్పందనకు 4 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో 4 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కె.వాణి సోమవారం చెప్పారు. మురుగునీటి పారుదల వల్ల ఇబ్బందులు, రొయ్యల చెరువుల్లోని నీటి వల్ల ఇబ్బంది, ఆక్వా విద్యుత్ సబ్సిడీ చెల్లించాలని వినతులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదుల్ని పంపినట్లు వివరించారు.

జూదరుల అరెస్ట్

సాక్షి, భీమవరం: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.అప్పారావు చెప్పారు. ఉండి రోడ్డులోని కారుల షెడ్‌లో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.17,240 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ఆకివీడు: స్థానిక సంతపేటలో ఉంటున్న సుంకర నందిని తన భర్త రామారావు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఫణి మోహన్ సోమవారం చెప్పారు. గత నాలుగేళ్ల నుంచి వేధింపులకు పాల్పడుతున్నాడని, భరించలేక ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.